క్లుప్తంగా

రవితేజ సొసైటీలో నిత్యావసరాలు పంపిణీ



రవితేజ సొసైటీ నిర్వాహకులకు నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు పోణంగి రోడ్డులోని రవితేజ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రిలీఫ్ సెంటర్‌లో లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరావు ఆర్థిక సహకారంతో రూ.10 వేల విలువ కలిగిన నిత్యావసర సరుకులను నిర్వాహకులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రోటరీ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ పీ.దామోదరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యపరమైన అనేక విషయాలను వివరిస్తూ సమయానికి మందులు వాడటం, శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని తద్వారా చదువుమీద దృష్టి కేంద్రీకరించవచ్చని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు వీ.సురేష్, జోన్ చైర్మన్ కే.విజయలక్ష్మి, హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చీరలను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీకళాభారతి హస్తకళ, చేనేత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. గృహాలంకరణకు ఉపయోగపడే కొండపల్లి కొయ్యబొమ్మలు, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, మైసూర్ రోజ్‌ఉడ్, సహరన్ పూర్ ఉడ్ కార్వింగ్ బొమ్మలను, మట్టి, పింగాణీ సామగ్రిని ప్రదర్శించి విక్రయిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి, గద్వాల, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, ధర్మవరం చేనేత, కాటన్, పట్టు వస్త్రాలు మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రదర్శనలో సుమారు 200 రకాల రకాల చేనేత వస్త్రాలు, హస్తకళా వస్తువులను ఆయా కళాకారులు ఏర్పాటు చేశారని, ప్రదర్శన నిర్వాహకులు తెలిపారు. ఉత్పత్తి ధరకే ప్రజలకు అందిస్తున్నారని, ప్రజలు కళాకారులను ప్రోత్సహించి, ఆదరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

జగనన్న సురక్షకు జనామోదం

- ఏలూరులో జోరుగా సర్టిఫికెట్ల పంపిణీ
- తోటకూరదొడ్లు సురక్ష శిబిరంలో 1,708 మందికి ధ్రువపత్రాలు అందజేత

ఏలూరు టౌన్: సంక్షేమ అజెండాతో నాలుగేళ్లుగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నరీతిలో చేపట్టిన జగనన్న సురక్షకు జనామోదం లభిస్తోంది. గత టీడీపీ పాలనతో పోల్చుకుంటూ నేడు సీఎం వైఎస్ జగన్ ఉచితంగా అందిస్తున్న సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో జగనన్న సురక్ష రెండో రోజు సర్టిఫికెట్ల పంపిణీ శిబిరం విజయవంతమైంది. వందలాది మంది లబ్ధిదారులు శిబిరానికి తరలివచ్చి తమ కుటుంబాల్లోని సభ్యులకు అవసరమైన సర్టిఫికెట్లు అధికారుల నుంచి తీసుకుని ఆనందంగా ఇళ్లకు వెళ్లారు.

ఏలూరు వన్‌టౌన్ తోటకూరదొడ్లు ప్రాంతంలో తోటకూరదొడ్లు 1, 2, 3 గజ్జలవారి చెరువు, నాగేంద్రకాలనీ 3 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. జగనన్న సురక్ష క్లస్టర్-1 ఇన్‌ఛార్జ్ మోటమర్రి సదానందం, 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి, 5వ డివిజన్ కార్పొరేటర్ గరికిముక్కు ఇమ్మానుయేల్ జయకర్, 8వ డివిజన్ కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, 4వ డివిజన్ కార్పొరేటర్ చిలకపూడి డింపుల్ జాబ్, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, పీవో కృష్ణమూర్తి, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు ఉన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సదానందం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన ప్రజల ఇంటివద్దకే తీసుకువచ్చి సేవలు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని సారథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యమన్నారు.

జగనన్న సురక్ష శిబిరంలో భాగంగా ఏలూరు వన్‌టౌన్ తోటకూరదొడ్లు ప్రాంతంలోని ఐదు సచివాలయాల పరిధిలో ఆరు రోజుల పాటు ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 5 సచివాలయాల పరిధిలో 3,688 గృహాలను సర్వే చేశారు. ఈ సర్వేలో 2,042 మంది సర్టిఫికెట్లు కోరారు. సురక్ష శిబిరంలో 1,708 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వీటిలో కుల ధ్రువీకరణ పత్రాలు 931, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 378, ఆధార్ అనుసంధానం 379, రైస్ కార్డులు కొత్తవి, చేర్పులు, మార్పులు 19, పెన్షన్ కోరినవారు 1, సరైన పత్రాలు లేక పరిష్కారం కానివి 334 ఉన్నాయి.



ఏలూరు వన్‌టౌన్ తోటకూరదొడ్లు ప్రాంతంలో జగనన్న సురక్ష శిబిరంలో సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సదానందం, కార్పొరేటర్లు

అన్నీ ఇంటి వద్దకే వస్తున్నాయి



ప్రజలకు ఏవిధమైన అవసరాలు ఉన్నాయనేది గుర్తించి ఇంటికే వచ్చి తెలుసుకుని, ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు ఇవ్వటం అనేది మంచి విషయం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన ఇంటివద్దకే తీసుకువచ్చారు. గతంలో ప్రజలను అధికారులు ఎవరూ పట్టించుకునే వారు కాదు. నేడు అన్నీ ఇంటి వద్దకే వస్తున్నాయి. ప్రజలకు ఇలాంటి పాలన నచ్చుతుంది.

– పీ.రాము, వన్‌టౌన్, ఏలూరు

సీఎం జగన్ పాలన బాగుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సౌకర్యాలు బాగున్నాయి. వలంటీర్లు ఇంటికే పెన్షన్ తేవటం, పథకాలకు దరఖాస్తులు చేయటం, దగ్గరలోనే సచివాలయంలో అన్ని పనులు అవుతున్నాయి. ఇప్పుడు ఉచితంగా ఇంటికే వచ్చి మాకు కావాల్సిన సర్టిఫికెట్లు ఇవ్వటం మంచి విధానం. గతంలో తాహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

– దాడి మహేశ్వరి, వన్‌టౌన్, ఏలూరు

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అప్పనవీడులో జగనన్న సురక్ష పథకంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: జగనన్న సురక్ష పథకంలో ప్రభుత్వం ఇంటిముందుకే వచ్చి వివిధ రకాల సర్టిఫికెట్లు అందిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో జగనన్న సురక్ష పథకంలో భాగంగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలో సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందించారు. చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అనేక పథకాలను ప్రజల ఇంటి ముందుకే వచ్చి అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, వైఎస్ ఎంపీపీ అప్పన పద్మావతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్దే రామసీత, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్‌రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- మల్కాపురం ప్రజలకు ధ్రువపత్రాలు మంజూరు
- గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

ఏలూరు రూరల్: ప్రజల వద్దకే సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఏలూరు మండల ప్రత్యేక అధికారి, జిల్లా డీఆర్వో ఏవీఎన్ఎస్ మూర్తి అన్నారు. శనివారం ఏలూరు మండలం మల్కాపురం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో సంక్షేమ పథకం పొందుతున్నామనే ఆనందం వ్యక్తమవుతుందన్నారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ధ్రువపత్రాలు మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. తహసీల్దార్ బి సోమశేఖర్ మాట్లాడుతూ మండలస్థాయిలో అందుకునే ప్రభుత్వ సేవలు గ్రామాల్లో సచివాలయ స్థాయికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. కుల, ఆదాయ, నివాసిత, కౌలురైతు అర్హత, ఆధార్ అనుసంధానం తదితర 11 అంశాల గల ప్రభుత్వ సేవలను ఇంటికే చేర్చి అందించడం వల్ల పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచ్ పత్యాల సునీత మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల రూపాయలతో సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, నాడు-నేడు నిధులతో పాఠశాల అభివృద్ధి, సీసీరోడ్లు తదితర అభివృద్ధి పనులు ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం పలు రకాల పత్రాల కోసం దరకాస్తులు చేసుకున్న ప్రజలకు డీఆర్వో చేతుల మీదగా అర్హత పత్రాలు అందజేసారు. దీనికి ముందు అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పంట చేలకు వెళ్లే బండ్ల దారిని లే అవుట్ యజమానులు కంచె వేసి మూసేసారంటూ పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసారు. దీనిపై స్పందించిన అధికారులు లే-అవుట్ పరిశీలించి రైతులకు దారి కల్పించారు. దీనిపై రైతులు హర్షం వెలిబుచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, కార్యదర్శి రవీంద్ర పరివేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ తూతా నిరంజన్, పాలకవర్గ సభ్యులు, ఎంఏఓ జీవనసంధ్య, పశువైద్య అధికారి ఎం లక్ష్మీ, రెవెన్యూ, పంచాయతీ, ఎంఎస్ఆర్ఈజీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల నుంచి పలు రకాలు ధ్రువీకరణ పత్రాలు అందుకున్న గ్రామస్తులు, స్థానిక లే అవుట్ నుంచి రైతులకు దారి కల్పించిన అధికారులు

జగన్ పాలన బాగుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుంది. రైతుల కోసం ఆయన చేపట్టిన రైతు భరోసా పథకం వ్యవసాయాన్ని పండుగ చేసింది. ఆయన దయవల్లనే నేడు రైతులు ధైర్యంగా సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోకపోవడం వల్ల సాగుకు రైతులు భయపడే వారు. నేడు ఆ పరిస్థితి మారింది.

– తూతా నిరంజన్, ఉపసర్పంచ్

అందరికీ సంక్షేమ లబ్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత కల్గిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. లబ్ధిదారులకు ఎవ్వరి సిఫార్సు అవసరం లేదు. వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి, నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే నగదు బదిలీ చేయడం చాలా బాగుంది. దీనివల్ల నిజమైన అర్హులకు న్యాయం జరుగుతోంది.

– గొర్రైల సాంబశివరావు

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ ఎన్. నాగబాబు డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం నగరంలో పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పలు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను తరగతుల నుంచి బయటకు తీసుకువచ్చారు. ఏబీవీపీ విభాగ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. వెంకటేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ బంద్ కార్యక్రమంలో నాయకులు కే. రాకేష్, ఎస్. సాయి కిరణ్, ఆర్. శివనాగరాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెదపాడు: సత్యవోలులో అధికారులు దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని సత్యవోలు వైపునకు పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో విజిలెన్స్ అధికారులు వాహనాన్ని వెంబడించారు, షణ్ముక సాయి కృష్ణా ట్రేడర్స్ పేరుగల రైస్‌మిల్ వద్ద ఆగడంతో రైస్‌మిల్లులోను పక్కనే ఉన్న గోడౌన్‌లోను తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 9వేల విలువైన పీడీఎస్ బియ్యాన్ని రూ. లక్ష విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బూర్ల రాజశేఖర్, చిన్ని బంగారాయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	94	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	42
పచ్చిమిర్చి	80-88	బీట్‌రూట్	42
కాకర కాయలు	68	కీరా దోస	74
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	140-250
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	15-30
క్యారెట్	42	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	23	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24-30	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	18
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రింటర్ అందజేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు లేళ్ల వెంకటేశ్వరరావు సహకారంతో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ. 19 వేల విలువ గల మల్టీ-ఫంక్షన్ ప్రింటర్ (కలర్ ప్రింటర్, జిరాక్స్, స్కానర్)ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు జీ గిరిబాబుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యాభ్యాసం చేసే ప్రభుత్వ విద్యా సంస్థలకు దాతలు తమ వంతు సహకారం అందించడం ద్వారా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. కళాశాలకు ప్రింటర్ అందజేసిన దాత ఎల్. వెంకటేశ్వరరావుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే.అజయ్ కుమార్, వీ.వెంకటరావు, ఎం. కృష్ణ చైతన్య తదితర అధ్యాపకులు, హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, కార్యదర్శి, బీవీవీ సత్యనారాయణ, సభ్యులు డీ. హేమసుందర్, కమ్ముల ఆదినారాయణ, ఏలూరు సన్ రైజ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీ. సురేష్ పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలకు ప్రింటర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సెయింట్ థెరిస్సా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సెయింట్ థెరిస్సా స్వయంప్రతిపత్తి మహిళా కళాశాల ప్రారంభించి బుధవారం నాటితో 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మదర్ ఆగ్నెస్టిన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థినులను విద్యారంగంలో ప్రోత్సహించి వారిని సాధికారికత వైపు నడిపించడానికి తమ కళాశాల ఏడు దశాబ్దాలుగా కృషి చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యార్థుల కళాశాల జీవితానికి సంబంధించిన అన్ని కార్యకలాపాల్లో తమ కళాశాల ఏడు దశాబ్దాలుగా అనేక రంగాల్లో ఉత్తమ కళాశాలగా ఎంపికయిందని గుర్తు చేశారు. అంతుకు ముందు కళాశాల విద్యార్థినులు ఏడు దశాబ్దాలను సూచిస్తూ ఏడు రంగుల వస్త్రాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కథోలిక పీఠం ప్రతినిధులు ఫాదర్ పీ. బాల, ఫాదర్ జీ, మోజెస్, ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ అల్ఫాన్స్, ఫాదర్ రాబిన్ తదితరులు పాల్గొని దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సెయింట్ థెరిస్సా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఫాదర్ బాల

వేధింపుల కేసుల్లో భూ సమస్యలే అధికం



మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్

పెదవేగి : గ్రామీణ ప్రాంతాల్లో నమోదవుతున్న కులం వేధింపుల కేసుల్లో భూ సంబంధ సమస్యలే అధికమని నూజివీడు డీఎస్పీ ఈడా అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. పెదవేగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు విషయమై విచారణకు వచ్చిన ఆయన మాట్లాడుతూ కులం వేధింపుల కేసుల్లో ఎక్కువుగా స్థల వివాదాల సమయంలో జరిగే గొడవలే ఉంటున్నాయన్నారు. మరికొన్ని ఘటనల్లో జరిగిన విషయాన్ని పక్కన బెట్టి, లేని విషయాన్ని బయటకు తీస్తూ కులం పేరుతో దూషించినట్లు, దాడులకు తెగబడినట్లుగా ఫిర్యాదు చేస్తున్నట్లుగా కొన్ని కేసుల్లో స్పష్టమవుతోందని ఆయన చెప్పారు. ఇది సరైన విధానం కాదని, వాస్తవాలను వక్రీకరించి, ఫిర్యాదులు చేసుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో ఇరుపక్షాలు కోర్టులో వివాదాలు నడుస్తున్న సమయంలో అవగాహన లోపంతో చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుంటున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వాస్తవాలను వక్రీకరించి, కేసులను పక్కదోవ పట్టించడం సరికాదని, అలాంటి వారిపై కూడా చర్యలు ఉంటాయని డీఎస్పీ స్పష్టం చేశారు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఉన్నారు.